విలేకరులు కావలెను

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY    R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 132 | శనివారం 12. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## 17న పబ్లిక్ గార్డెన్‌లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



హైదరాబాద్, (తెలంగాణ వాణి) ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సిపీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని మిగతా 2లో..

# కమీషన్లు నాకెందుకు!?

- దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు.. ఇంకా కక్కుర్తి ఎందుకు!?
- డబ్బులు కావాలనుకుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో
- వేల కోట్లు సంపాదించేవాడ్ని.. కక్కుర్తిపడే జాతకం కాదు నాది
- జెన్‌జీ గురించి కాదు.. ఆల్ఫా, బీటాల గురించి ఆలోచిస్తున్నా
- పేదలకు న్యాయం జరగాలనే విద్య, న్యాయ శాఖలు తీసుకున్నా
- చట్టాన్ని కేంద్రం ఆమోదించగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధ్యయనానికి విదేశాలకు ఎమ్మెల్యేలు
- కేటీఆర్‌ను చూసి అసహ్యించుకునేవాళ్లే, అసూయ పడేవాళ్లు లేరు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పాపం నాది కాదు.. కేసీఆర్ సర్కారుది
- కాలేజీలపై దాడులు చేసి మరీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించింది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సన్నిహితుల కాలేజీలకే నిధులిచ్చింది
- పాలమ్మితే, పూలమ్మితే వందల కోట్లు వస్తాయా!?:
- అసెంబ్లీలో విద్యా విధానంపై లఘు చర్చలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ తెలంగాణ వాణి)

విద్యాశాఖ అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ అని, ముఖ్యమంత్రి విద్యాశాఖను నిర్వహిస్తున్నారంటే ఆ శాఖు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(శుక్రవారం, సెప్టెంబర్ 11వ తేదీ) అసెంబ్లీ వేదికగా సీఎం విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడంపై వస్తున్న విమర్శలకు వివరణ ఇచ్చారు. 'విద్యా శాఖ అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ. ముఖ్యమంత్రి విద్యాశాఖను నిర్వహిస్తున్నారంటే ఆ శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టే. విద్యాశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తే మొత్తం ప్రభుత్వ వ్యవస్థ పాల్గొంటుంది. చీఫ్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ సహా అధికారులు సమీక్షకు హాజరవుతారు. మంత్రిగా విద్యాశాఖ సమీక్ష చేస్తే సంబంధిత విద్యాశాఖ అధికారులు మాత్రమే హాజరవుతారు. ముఖ్యమంత్రిగా విద్యాశాఖను సమీక్షిస్తే మొత్తం వ్యవస్థను ఒకే, టేబుల్‌పైకి తీసుకురాగలుగుతాం. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం ఉంటుంది. విద్యాశాఖకు ఫుల్‌టైమ్ మంత్రి లేరని పరిమిత సమాచారంతో విమర్శలు చేయడం సరికాదు. వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ప్రభుత్వం పనిచేస్తోంది. పేదలకు మేలు జరిగే శాఖలను ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షించాలి. న్యాయశాఖ, విద్యాశాఖ వంటి కీలక శాఖలను నా వద్దే ఉంచుకున్నా. ప్రజాస్వామ్యంలో పీఎం, సీఎం, డీఎం అత్యంత శక్తివంతమైన పదవులు. ముఖ్యమంత్రి వద్ద ఉన్న అధికార పరిధి అత్యంత కీలకమైనది. మంత్రులందరూ ముఖ్యమంత్రికి సహాయక వ్యవస్థగా పని చేస్తారు. అధికారులు, ఇతర వ్యవస్థలు కూడా ప్రభుత్వానికి సహాయక వ్యవస్థలే. పేదలకు మేలు చేసే నిర్ణయాలు వేగంగా తీసుకోవడమే లక్ష్యంప్రైవేటు విద్యా వ్యవస్థలో రెండున్నరేళ్లకే పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఐదేళ్లకు పాఠశాలకు పంపిస్తున్నారు. అందుకే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారు. నర్సరీ, ఎల్.కే.జీ విధానంతో పాటు ఇంగ్లీష్ భాష కోసం తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు చూస్తున్నారు. అందుకే ప్రభుత్వం పాఠశాలల్లో మొట్ట మొదటిసారిగా ప్రీ ప్రైమరీ విధానాన్ని ప్రారంభించాం. ఈ ఏడాది 64 వేల మంది ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నాం. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. సెంట్రలైజ్డ్ కిచెన్స్ డిజైన్ చేసి నాణ్యమైన హైజెనిక్ బ్రేక్ ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం. విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నాం. పదేళ్లు వాళ్లు పట్టించుకోకపోతే మేం అధికారంలోకి రాగానే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాం. ఒక రేవంతన్నగా మేం ఇన్ని చేసినా ఎప్పుడూ చెప్పుకోలేదు' స్పష్టం చేశారు.

## భూకుంభకోణం బయట పెట్టినందుకే ఆ మంత్రి బర్తరఫ్

- దేశ చరిత్రలోనే అతిపెద్ద భూదోపిడి తెలంగాణలో జరుగుతోంది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత బాధితులతో బీఆర్ఎస్ నేతలు సమావేశం



- మా ప్రభుత్వంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత జాబితా ఇప్పుడు కోటి 16 లక్షల ఎకరాలకు చేరింది.
- ప్రభుత్వంలో ఇటీవల ఒక మంత్రి బర్తరఫ్ అయ్యారు.
- ఎందుకంటే, సీఎం రేవంత్ సోదరులు మంచిరేవులలో చేస్తున్న భూకుంభకోణం
- ఆ మంత్రి కుమార్తె బయటపెడితే చివరకు ఆ వ్యవహారం చినికి చినికి గాలివానలా మారింది"

## పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

- బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన రష్యా అధ్యక్షుడు
- ద్వైపాక్షిక అంశాలపై ప్రధాని మోడీతో చర్చలు
- 2030 నాటికి ఇరుదేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా ఒప్పందాలు
- సీమాంతర ఉగ్రవాదంతో దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నాం
- మరోవైపు, ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అవసరమైతే మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నాం
- భారత్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో వీరి సమావేశానికి మరింత ప్రాధాన్యం



## తెలంగాణపై అల్పపీడన ప్రభావం

హైదరాబాద్ తెలంగాణ వాణి)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా నేటి నుంచి వర్షాలు ఊపందుకోనున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఉత్తర, తూర్పు తెలంగాణ పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతాలతో పాటు సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, సిద్దిపేట, హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. ముఖ్యంగా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము సమయంలో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విస్తారంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలంగాణ వెదర్మ్యాన్ హెచ్చరించారు. అర్ధరాత్రి వేళ ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 60 నుంచి 70 మిల్లీమీటర్ల వరకు భారీ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు అక్కడక్కడా మోస్తరు వర్షాలు లేదా తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు మొదలవుతున్నందున ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు, రైతాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## రిజర్వాయర్లపై సోలార్ ప్రాజెక్టులు

ఫ్లోటింగ్ సోలార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ తెలంగాణ వాణి) రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్ మిగతా 2లో..

## 22ఏ పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు
- భూ భారతి పేరిట భూహారతికి పాల్పడుతున్నారు
- తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ సమావేశం
- ఫోన్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు.
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్వయంగా కలిసినా ఫలితం లేదు.
- 22ఏ పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గం.
- కేసీఆర్ నాయకత్వంలో పోరాడి ప్రభుత్వం మెడలు వంచుతాం.
- తప్పు కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై నెపం నెడుతున్నారు.
- సీఎం రేవంత్‌రెడ్డి భూమే కేంద్రంగా పాలన చేస్తున్నారు.
- 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ భూములపై కన్నేశారు.
- హైడ్రాకు బడాబాబులు కనిపించరు.. పేదలపైనే వారి ప్రతాపం.
- పొంగులేటికి నైతిక బాధ్యత ఉంటే వెంటనే పదవికి రాజీనామా చేయాలి





## ఆర్మీ ఆయుధాలను గుంత తీసి పాతిపెట్టిన హవల్దార్

- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆర్మీ ఆయుధాల చోరీ
- కేసు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి
- పిస్టల్స్, మ్యాగజైన్లు, బుల్లెట్స్, బైనాక్యులర్ చోరీ చేశారు.
- బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ఎవరెవరికి అనుమతి ఉందని విచారించాం. ఆర్మ్స్ కోర్టు ఇన్‌ఛార్జ్ వినోద్‌కుమార్‌తో పాటు అమ్యునేషన్స్ కోర్టు (ఆయుధాగారం) ఇన్‌ఛార్జ్ బల్లి మధులను అనుమానితులుగా విచారించాం. మా దగ్గర ఉన్న ఆధారాలతో మల్లేశ్ కదలికల గురించి ప్రశ్నించాం.
- కదలికల గురించి వాస్తవాలు చెప్పకుండా అతడు దాచిపెట్టాడు.
- తొలుత విచారణ కోసం మేం పిలిస్తే రాలేదు. ఫోన్ కాల్ లిస్ట్, వాట్సప్ చాటింగ్‌లు డిలీట్ అయ్యాయి.
- ఆ తర్వాత మల్లేశ్‌ను ప్రశ్నిస్తున్నప్పుడు ఆయన ముఖంలో చెమటలు పట్టి భయం కనిపించింది.
- కేసు తీవ్రతను ఆయన భార్యకు వివరించాం.
- ఆమె గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ నిజం అంగీకరించాడు.
- చోరీ చేసిన ఆయుధాలను నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని స్వగ్రామానికి తీసుకెళ్లి గుంతతీసి పాతిపెట్టాడు.

## అసెంబ్లీకి వెళ్తుంటే యుద్ధ వాతావరణం సృష్టించారు

- మాజీ మంత్రి , ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- ఢిల్లీలో జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలకి ఎమ్మెల్యే ఫిర్యాదు
- "అసెంబ్లీ వద్ద మాకు జరిగిన అవమానం చాలా బాధ అనిపించింది.
- మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ అరాచకం సృష్టించే యత్నం చేశారు.
- కుట్రలో భాగంగానే ఇదంతా జరిగిందని అర్థమవుతోంది.
- మమ్మల్ని రక్షించేందుకు మా ఎమ్మెల్యేలు ప్రయత్నించారు.
- ఎమ్మెల్యేలను తోసేస్తే కిందపడిపోగా.. వాళ్లను కూడా తొక్కేశారు.
- జగదీశ్‌రెడ్డి బీపీ పెరిగి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు.
- చాలా మంది శాసనసభ్యులకు దెబ్బలు తగిలాయి.
- ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై డీజీపీ ఆఫీసులో ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు"





## ఈ నెల 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ 25 ఏళ్ల పాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 17న మోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, వ్యాసరచన పోటీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం కూడా ఉన్నందున, ఆ రోజు సాయంత్రం హైదరాబాద్‌లో 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంతో ఈ అభియాన్‌ను ప్రారంభిస్తామన్నారు.

## హైదరాబాద్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటీ సంస్థల ఆసక్తి

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి శ్రీధర్‌బాబు
- అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఐదో రోజు ప్రశ్నోత్తరాలు
- "టైర్-2 సిటీల్లోని ఐటీ టవర్లలో సంస్థల ఏర్పాటుకు ముందుకు రావట్లేదు.



- జిల్లాలోని ఐటీ టవర్ల సమీపంలో మౌలిక వసతులపై ఆలోచిస్తున్నారు.
- ఈ ఏడాదిలో 65 జీసీసీలు తీసుకొచ్చాం.
- 85 శాతం రెంటల్ స్పేసెస్ జీసీసీలతో నిండిపోయింది.
- జీసీసీల రాకతో రెండేళ్లలో లక్ష కొత్త ఉద్యోగాలు రానున్నాయి.
- కొత్త జీసీసీ పాలసీ తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.
- డేటా సెంటర్ల ఏర్పాటుకు రూ.70వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం.
- డేటా సెంటర్ల ఏర్పాటుతో ఎన్ని లాభాలున్నాయో.. అన్ని అనర్థాలు కూడా ఉన్నాయి.
- ఏఐ వచ్చిన తర్వాత ఉపాధి కల్పన తక్కువగా ఉంది"

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



**భువనగిరి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
విద్యార్థి దశ నుంచే భారతీయ చట్టాలపై అవగాహన పెంచుకుని నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వకేట్ ఆకుల మల్లేశ్ సూచించారు. శుక్రవారం భువనగిరిలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సలహాలకు 15100, బాలల సహాయానికి 1098, అత్యవసర పరిస్థితుల్లో 112 లేదా 100, సైబర్ నేరాలపై 1930కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.అరుంధతి, కళాశాల లీగల్ సేల్ కో-ఆర్డినేటర్ ఆర్.అవనీధర్ గౌడ్, కే.కరుణాకర్ రెడ్డి, ఎన్.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేకరి):**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కల్లెడ రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా దుబ్బక గంగప్రసాద్, కార్యదర్శిగా జింక నరేష్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కల్లెడ ఉషయ్య, పల్లికొండ శివ, నరుకుల హరీష్, పెద్దబోయిన గంగాధర్, తోకల హరీష్ కుమార్, తోపారపు ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ మోరపాక శ్రీనివాస్ ఫలితాలను ప్రకటించారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ



**చేర్యాల, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చేర్యాలలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శుక్రవారం ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ అపూర్వ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ బి. తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కే ఎల్ ఐ ద్వారా తక్షణమే డిండి ప్రాజెక్టును నింపాలి

### నిజాంనగర్ మాజీ సర్పంచ్ భూతం నరేష్



**డిండి (తెలంగాణ వాణి)**
డిండి ఆయకట్టు కు రైతాంగానికి కె ఎల్ ఐ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నిజం నగర్ మాజీ సర్పంచ్ భూతం నరేష్ కోరారు. రైతులు డిండి ఆయకట్టు కింద ఇప్పటికే 17,వేల ఎకరాలను వరి సాగు చేయడం జరిగింది రైతుల పట్ల నిష్పక్షపాతంగా ఉండాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు వరి పండాలంటే తక్షణమే నీటిని విడుదల చేయాలని అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముదిరాజ్ నాయకుల అరెస్టులపై తీవ్ర ఖండన



**డిండి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ముదిరాజ్‌లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'ఛలో అసెంబ్లీ--ముట్టడి'కి పిలుపునిచ్చిన నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ముదిరాజ్ చైతన్య వేదిక--తెలంగాణ నాయకులు తీవ్రంగా ఖండించారు. గచ్చిబౌలిలో డా. వై. శివ ముదిరాజ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసించారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించాలని, చేప పిల్లల పంపిణీలో అవినీతిని అరికట్టి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని, హామీలు అమలు చేసే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అరెస్ట్ అయిన వారిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గాజుల రామయ్య, తవిటి సుధాకర్, పోలం లక్ష్మణ్, నూకం వెంకటేష్, నూకం చంద్రయ్య, మందుల సైదులు, నూకం శీను, గుడి రాములు, బతిక పర్వతాలు, పోలం మల్లేష్, పుట్ట తిరుపతయ్య, లోకం లింగమయ్య తదితరులు ఉన్నారు.

## రూ.19 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) నిధులు రూ.19 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నర్ర బిక్షపతి, శ్రీధర్ చారి, కుమార్, రాజిరెడ్డి, శాంతినగర్--శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు అంజిరెడ్డి, ఏ. వెంకట్ రెడ్డి, టైలర్ విజయ్, రవీంద్ర, కార్ రాజు, డీ ఈ కృష్ణవేణి, ఈ ఈ సురేష్ కుమార్, ఏ ఈ లావణ్య, కాంట్రాక్టర్ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బిఎంఈఓలు - ఉపాధ్యాయ సంఘాలు- చట్ట పరిధి ఏంటి? నైతికత ఏం చెప్తోంది?



గత కొద్ది రోజులుగా మండల విద్యాధికారుల (MEO) తీరు పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత వారం సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ఎం ఈ ఓ లకు జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీమతి రోహిణి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ సంఘటన నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల్లో వారి పాత్రపై విద్యా శాఖలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో "ఎంఈఓ" లు ఉపాధ్యాయ సంఘాల్లో క్రియాశీలకంగా వ్యవహరించవచ్చా?" అనే ప్రశ్న తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకుంది.

**చట్టం ఏమంటోంది?**
భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(సి) ప్రకారం... సంఘాలు లేదా యూనియన్లను ఏర్పాటు చేసుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు. చట్టపరంగా గానీ, సర్వీసు నిబంధనల పరంగా గానీ చూస్తే ఎంఈఓలు ఉపాధ్యాయ సంఘాల్లో సభ్యులుగా ఉండటానికి లేదా పదవులు చేపట్టడానికి ఎలాంటి ఆటంకాలు లేవు. ఎంఈఓలు ఉపాధ్యాయ సంఘాల్లో క్రియాశీలకంగా వ్యవహరించరాదని రాష్ట్ర ప్రభుత్వంగానీ, విద్యాశాఖగానీ ఇప్పటివరకు ప్రత్యేకమైన నిషేధ ఉత్తర్వులేవీ జారీ చేయలేదు. కాబట్టి, సాంకేతికంగా ఇందులో ఎలాంటి చట్ట ఉల్లంఘనా లేదు.

**నైతిక చిక్కులు -- పర్యవేక్షణ హోదా!**
అయితే, ఇక్కడే ఒక మౌలికమైన, నైతికమైన సమస్య ఉత్పన్నమవుతుంది. మండల పరిధిలోని ఉపాధ్యాయులందరికీ ఎంఈఓ ఒక పర్యవేక్షణ అధికారి. తన పరిధిలోని ఉపాధ్యాయులందరినీ ఆయన సమదృష్టితో చూడాల్సి ఉంటుంది. కానీ, ఎంఈఓ స్వయంగా ఒక ఉపాధ్యాయ సంఘంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పుడు, ఆ సంఘ సభ్యుడికి, మరొక ఉపాధ్యాయుడికి మధ్య ఏవైనా విభేదాలు వస్తే ఎంఈఓ నిష్పాక్షికతపై సహజంగానే అనుమానాలు మొదలవుతాయి. ఎంఈఓ పూర్తి నిజాయితీతో, నిబంధనలకు కట్టుబడి విచారణ జరిపి నివేదిక ఇచ్చినా... బాధితులు తన సొంత సంఘం మనిషికే ఎంఈఓ మద్దతుగా నిలిచారు" అని ప్రచారం చేసే ప్రమాదం ఉంది.

**న్యాయం జరుగుతున్నట్లు కనిపించాలి!**
గతంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి. చంద్రచూడ్ గారు ఒక అమూల్యమైన మాట చెప్పేవారు. "న్యాయమూర్తులు సరైన తీర్పులు ఇవ్వడం ఎంత ముఖ్యమో, ఆ తీర్పులు న్యాయబద్ధంగానే వచ్చాయని ప్రజలు భావించడం కూడా అంతే ముఖ్యం" అని. ఈ సూత్రం విద్యాశాఖ పర్యవేక్షకులకు కూడా సరిగ్గా వర్తిస్తుంది. ఎంఈఓలు నిజాయితీగా పనిచేస్తున్నారనే విషయంతో పాటు తమ పట్ల ఎంఈఓ నిష్పాక్షికంగా ఉంటున్నారని సాధారణ ఉపాధ్యాయులు విశ్వసించడం కూడా అంతే ప్రధానం. న్యాయవ్యవస్థలో జడ్జీలకు పరిచయం ఉన్న వ్యక్తుల కేసులు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా ఆ బెంచ్ నుంచి తప్పుకోవడం మనం చూస్తూనే ఉంటాం. ఇది న్యాయస్థానాల పట్ల ప్రజల్లో విశ్వసనీయతను పెంచుతుంది.

**స్వీయ నియంత్రణ**
ఉపాధ్యాయులపై పర్యవేక్షణ అధికారిగా ఉన్నంత కాలం (అది రెగ్యులర్ అయినా లేదా ఇన్‌ఛార్జ్ అయినా) ఎంఈఓలు ఉపాధ్యాయ సంఘాల్లో క్రియాశీలకంగా ఉండకపోవడమే వారికే శ్రేయస్కరం. ఉపాధ్యాయ సంఘాల పదవుల్లో ఉండటం, సమావేశాలు నిర్వహించడం, ఉపాధ్యాయులను సంఘాల్లో సభ్యత్వం చేర్పించడానికి తిరగడం వంటివి పర్యవేక్షకుని హోదాకు ఎప్పుడో ఒకసారి ఇబ్బందికరంగా మారుతాయి. ఒకవేళ ఎంఈఓలు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘం ఏర్పాటు చేసుకోవాలనుకుంటే, ఎంఈఓలందరూ కలిసి ప్రత్యేకంగా 'ఎంఈఓల సంఘం' ఏర్పాటు చేసుకోవడం సమంజసం. దాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ, ఉపాధ్యాయ సంఘాల్లో బాధ్యతలు నెరపడం వల్ల తమ సొంత విశ్వసనీయతకే భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఎంఈఓలు తమ శ్రేయస్సును, తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి స్వీయ నియంత్రణ పాటించి, సరైన నిర్ణయం తీసుకోవాలి.

కరణం వెంకట రవీందర్
విశ్రాంత ఎల్ ఎఫ్ ఎల్ హెడ్ మాస్టర్
పటాన్ చెరు, సంగారెడ్డి జిల్లా
9440380601



## ఆలేరు రైతుల సమస్యలపై ఉన్నతస్థాయి భేటీ

**యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆలేరు నియోజకవర్గ రైతుల సమస్యల పరిష్కారంపై ఉన్నతస్థాయి భేటీ నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో నియోజకవర్గంలోని పీఏసీఎస్ చైర్మన్లు, ఆత్మ చైర్మన్ సమావేశమై రైతుల సమస్యలపై చర్చించారు. పామాయిల్, ఇతర పంటల సాగును ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, హార్టికల్చర్ అభివృద్ధి, మండల కేంద్రాల్లో గోదాముల ఏర్పాటుపై చర్చించారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఎమ్మెల్యే కోరిన మేరకు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.

## మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక



**గుండ్లపల్లి (డిండి), సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో అండర్-14, అండర్-17 బాలబాలికల పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి పి. నరసింహ క్రీడల ప్రాధాన్యతను వివరించగా, సర్పంచ్ నల్లగంతుల రవి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. ప్రిన్సిపల్ నారాయణరెడ్డి క్రీడలతో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. ఎంపికైన క్రీడాకారులను దేవరకొండ నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికపై అవగాహన సదస్సు

### మండల ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి



**డిండి సెప్టెంబర్ 11( తెలంగాణ వాణి ప్రతినిధి )**
గుండ్లపల్లి(డిండి ) మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వికసీత్ గ్రామపంచాయతీ ప్రణాళిక (వీజీపీపీ ) అవగాహన సదస్సు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి అధ్యక్షతన మండల కార్యాలయంలో సమావేశం హాల్ లో జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేజన్న, మండలంలోని సర్పంచులు మండల స్థాయి అధికారులు, వీబీ జి రామ్ జి ఏపీవో, సిబ్బంది, మరియు ఇతర అధికారులందరూ హాజరయ్యారు.

## పోషణ మాసం కార్యక్రమాలు



**రాయికల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, తల్లులు, పిల్లలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పాలు, పండ్లు, చిరుధాన్యాలు, మిల్లెట్స్ వంటి పోషక పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. అనంతరం పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్ ల, వార్డు సభ్యురాలు ఏ లావణ్య, కార్యదర్శి టి.రాజేష్, అంగన్వాడి టీచర్ ఈ.సుజాత, ఏఎన్ఎం రజిత,ఆశా వర్కర్ సుమలత, గర్భిణీలు, బాలింతలు, ఐదు సంవత్సరాల లోపు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## పేదింటి బిడ్డకు డాక్టరేట్ పట్టా




**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
కొత్తగూడెం నెహ్రూబస్తీకి చెందిన సంధ్యాల కొమరయ్య, శంకరమ్మల కుమార్తె సంధ్యాల హైమావతి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ సాధించారు. హైదరాబాద్‌లోని ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ శివప్రసాద్ శుక్ల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. రసాయన శాస్త్ర విభాగంలో డాక్టర్ ఆలియా పర్యవేక్షణలో 'డాకింగ్ స్టడీస్ అండ్ టెట్రాజోల్ డెరివేటివ్స్' అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి పట్టుదలతో ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పట్టణ ప్రముఖులు, మిత్రులు హైమావతిని అభినందించారు.

## మూసా పేటలో పూర్తి అయిన సప్త భజన

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 11, (తెలంగాణ వాణి):**



మండల పరిధి లోనిమూసా పేట గ్రామం లో గత వారం రోజులుగా కొనసాగిన సప్త భజన బుధవారం రాత్రి తో పూర్తి అయింది. ఈ రోజు జంబికుంట గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులు మాజీ సర్పంచ్ రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకుని భజన కార్య క్రమంలో పాల్గొన్నారు. గురువారం ఉదయం గ్రామంలో అన్నీ వీధులు భక్తులు కలియ తిరుగుతూ భజన చేయడం విశేషం. గజవాడ మహేష్ గుప్త, మాజీ సర్పంచ్ నర్సింలు సెట్, అశోక్ లు ఈ కార్య క్రమంలో చురుకుగా పాల్గొన్నారు. పెద్ద శంకరం పేట నుంచి కూడా శ్రీ రామ్ మందిరం భజన మండలి సభ్యులు ఒక రోజు సప్త భజన కార్య క్రమంలో పాల్గొన్నారు. గ్రామ మహిళలు కూడా పెద్ద ఎత్తున ఈ భజన కార్య క్రమంలో పాల్గొన్నారు. గత వారం రోజుల నుంచి గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లి విరిసింది.

## కోజన్ కొత్తూర్ గ్రామంలో ఆత్మ క్షేత్ర ప్రదర్శన...




**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్11(తెలంగాణ వాణివిలేకరి )**
జగిత్యాల జిల్లాఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్ గ్రామంలో(అగ్రికల్చర్ టెక్నాలజీ మానేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు సన్న రకాల వరి సాగు ప్రోత్సాహం నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులకు నానో ఎరువులను అందించి, వాటి వినియోగ విధానాన్ని ప్రత్యక్షంగావివరించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్ ప్రసాద్, ఏఈఓ వినోద్, సాగర్. రైతులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి




**జమ్మికుంట, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని చిన్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సూచించారు. శుక్రవారం వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే భవిష్యత్‌లో మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రుణాలను ఇతర అవసరాలకు కాకుండా వ్యాపార అభివృద్ధికే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి టీఎంసీ మల్లీశ్వరి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అర్పిత, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి



**రాయికల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
యువత గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పలువురు వక్తలు సూచించారు. బజరంగ్ దళ్ జగిత్యాల జిల్లా రాయికల్ ప్రఖండ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రణతి జూనియర్ కళాశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్త ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత ఆరోగ్యం, విద్య, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ జీవితం దెబ్బతింటున్నాయని తెలిపారు. యువత విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, ఏఎస్ఐ సైఫుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ బందెల తిరుపతి, శ్రీధర్ రెడ్డి సూచించారు.కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా గోరక్ష ప్రముఖ్ వినయ్, మండల కో-కన్వీనర్ రాజు, కళాశాల ప్రముఖ్ వరుణ్, రవి కిరణ్, ప్రశాంత్, అజయ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే నిర్దిష్ట లక్ష్యం ఏర్పరుచుకోవాలి



**హుస్నాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ఆర్‌సి)**
విద్యార్థులు ఇంటర్మీడియట్ దశ నుంచే నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరుచుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కే. రవీందర్ రెడ్డి సూచించారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాలలో అందుబాటులో ఉన్న అనుభవజ్ఞులైన అధ్యాపకులు, డిజిటల్ విద్యాబోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలకు అవసరమైన డ్యూయల్ డెస్కులు మంజూరు చేస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, సీఐ కే. శ్రీధర్ విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఎస్.రాజు, ఎస్.సత్యనారాయణ, వి.రజని, ఎస్.వెంకటముత్యం, వి.సదాశివ్, సిహెచ్.రాజిరెడ్డి, సిహెచ్. విద్యాసాగర్, టి.రణధీర్, బి.ఎల్లయ్య, ఎస్.అశోక్, పి.చంద్రమోహన్, బి. వాల్య ఎం.వెంకటేష్, ఏ.మమత గ్రంథ పాలకులు ఆర్ వాసవి, వెంకట సాయి, శ్వేత పాల్గొన్నారు

## అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగ జరుపుకోవాలి

### ఆర్డీవో ధారూర్ సుబ్రహ్మణ్యం



**వనపర్తి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆర్డీవో ధారూర్ సుబ్రహ్మణ్యం సూచించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా పండుగను నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండపాల వద్ద భక్తి పాటలు, భజనలు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తిభావాన్ని చాటాలని సూచించారు. ఈ పీస్ కమిటీ సమావేశంలో పుర చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్,బిజెపి అధికార ప్రతినిధి నక్క మహేష్, సిపిఐ నాయకులు జబ్బర్, అఖిలపక్ష పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్బంధాలకు భయపడేది లేదు

### విద్యార్థి నాయకుల అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్వీ




**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల, జీవో 97 రద్దు, నిరుద్యోగుల హామీల అమలుకు ఆందోళనలకు పిలుపునిచ్చిన బీఆర్ఎస్వీ నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు భైరపాక ప్రశాంత్ ఖండించారు. జాబ్ క్యాలెండర్, రూ.5 లక్షల విద్యా గ్యారెంటీ కార్డు, విద్యార్థినులకు స్కూటీల హామీలను అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను అణచలేరని, హామీల అమలు కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## మురుగు కాలువలు పట్టవా?

### 49వ డివిజన్ రెవెన్యూ కాలనీలో బీఆర్ఎస్ నాయకుల పరిశీలన





**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
49వ డివిజన్ రెవెన్యూ కాలనీలో మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ముటిక రాజు ఆధ్వర్యంలో కంది యాదగిరి, జన్ను సంజీవ్, దొమ్మటి రాజేష్, అనిల్, అభిలాష్, రాజు యాదవ్ తదితరులు కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలిం చారు. గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వారు పేర్కొన్నారు. వెంటనే కాలువలను శుభ్రం చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## టీబీ నిర్మూలనకు విస్తృత అవగాహన కార్యక్రమాలు

### హసన్‌పర్తి పీహెచ్‌సీలో ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపు పరిశీలించిన డీఎంహెచ్‌వో



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
: ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా హసన్‌పర్తి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపును డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి పరిశీలించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఛాతినొప్పి, తెమడ, బరువు తగ్గడం, రాత్రిపూట జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీకి చికిత్స, మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామ్ భార్గవ్, డాక్టర్ సురేష్, సీహెచ్‌వో మాధవరెడ్డి, డీపీఎంవో దేవ్‌సింగ్, ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రతాప్, క్షయ నియంత్రణ విభాగం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

### జిల్లా ఎస్పీ సునితా రెడ్డి

**వనపర్తి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గణపతి నవరాత్రి ఉత్సవాలను అన్ని మతాల ప్రజలు పరస్పర సహకారంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునితా రెడ్డి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన శాంతి, సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ పోర్టల్ ద్వారా మండపాల వివరాలను నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, నిర్వాహకుల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలని,






సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదని స్పష్టం చేశారు. మండపాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పాయింట్ పుస్తకం తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని, అవసరమైన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమన్వయ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, సీఐలు సుగంధ రత్నం, రమేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, ఎస్సైలు, పోలీసు అధికారులు, వివిధ మతాల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, యువకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ఘనంగా నిర్వహించాలి

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్**
**వనపర్తి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ అన్నారు. వనపర్తిలో నిర్వహించిన బీజేపీ ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన నేపథ్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు సేవా సంకల్ప అభియాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో 'వికసిత భారత్'పై డ్రాయింగ్, వ్యాసరచన, డిబేట్ వంటి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు నోటీసులు అందితే నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ణీత సమయంలో స్పందించాలని సూచించారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం, విశ్వకర్మ జయంతి తదితర




కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న, రామన్నగారి వెంకటేశ్వర్లు రెడ్డి, మెంటం పల్లి పురుషోత్తం రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుజ్ఞ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, కల్పన, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద గొడవలు జరిగితే కమిటీలదే బాధ్యత

### ముందస్తు పోలీసు అనుమతితో ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్ఐ చలికంటి నరేష్

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ సూచించారు. పోలీసుల అనుమతి తీసుకుని, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ వినియోగానికి సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, పాటలు నిర్వహించరాదని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద గొడవలు జరిగితే కమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పండుగ ముగిసే వరకు ప్రతి



మండపం వద్ద కనీసం నలుగురు కమిటీ సభ్యులు ఉండాలని సూచించారు. పీర్లకొట్టం వద్ద నిమ్మతోట బజార్‌కు చెందిన 13 మంది యువకుల మధ్య వివాదం నేపథ్యంలో తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఎస్ఐఆర్ నోటీసుల జారీ, విచారణ వేగవంతం చేయాలి

**22-ఏ ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా**
**నిజామాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు జారీ చేసి, మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా విచారణ పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో నోటీసుల జారీ, విచారణ, పెండింగ్ అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. బీఎల్‌వోలు, సూపర్‌వైజర్ల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లతో ఫారం-8 సమర్పించేలా చూడాలన్నారు. 22-ఏ నిషేధిత భూములపై వచ్చే ఫిర్యాదులను భూభారతి నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్



భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## మట్టి వినాయకుడే మన దైవం

### ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలి: హెచ్ఎం గొట్టె శ్రీనివాస్

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గోవిందపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గొట్టె శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని, చెరువులు, నదులు, వాగులను కాలుష్యం నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి బీపీ యంత్రాలు విరాళం



**నిజామాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మనోరమా హాస్పిటల్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ శిరిపల్లి శ్రీనివాస్ 20 బ్లడ్ ప్రెజర్ అపరాటస్‌లను విరాళంగా అందించారు. మానవతా దృక్పథంతో వైద్య పరికరాలు అందించినందుకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. రాములు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి, ఆసుపత్రి యాజమాన్యం ఆయన సేవలను అభినందించింది.

## జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా బొల్లి శ్రీకాంత్

### విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పోరాడుతాం

**వనపర్తి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



వనపర్తి జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా బొల్లి శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జాతీయ నాయ కత్వానికి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతులు, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరతపై పోరాడుతామని చెప్పారు. ప్రతి విద్యార్థికి అండగా నిలిచి, వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తానని, జిల్లాలో ఎన్ఎస్‌యూఐని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

## మట్టి వినాయకులనే ప్రతిష్టిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### ఎల్బీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ




**హనుమకొండ, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి టౌన్):**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఎల్బీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ పిలుపునిచ్చారు. కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్‌సీసీ క్యాడెట్లు నల్లమట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేశారు. నీటి కాలుష్యాన్ని నివారించి జీవరాశులను రక్షించేందుకు మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, బానోత్ రాకేష్, రక్షిత్, శ్రీచరణ్, గోపు హేమంత్, ఇర్ఫాన్, మహేశ్వరి, శ్రద్ధ, భాను, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి

### నీటి ఎద్దడితో పూత రాలే అవకాశం



**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
పత్తి పంట పూత దశలో ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మామునూరు కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. నేలలో తేమ తగ్గితే పూత రాలడంతో పాటు పచ్చదోమ, తామర, పెనుబంక, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. వర్ధన్నపేట మండలం లోని దమ్మన్నపేట, అంబేద్కర్‌నగర్, రెడ్డిపాలెం గ్రామాల్లో శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. నేల తేమను కాపాడేందుకు అవసరమైన మేరకు నీటితడులు ఇవ్వాలని, మల్చింగ్ చేయాలని సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఆగుర్ల రాజు సూచించారు. తెల్లదోమ, తామర పురుగుల పర్యవేక్షణకు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని, పురుగుల ఉధృతి పెరిగినప్పుడే శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు వాడాలని కోరారు.

## గణేశ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### ట్రాఫిక్, భద్రతపై ప్రత్యేక దృష్టి : సీపీ శ్వేత, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.

కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం, చిన్నవడ్డేపల్లి, ఉర్సు చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. క్రేన్లు, రోడ్లు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. బంధం చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలని, నీటిమట్టం తక్కువగా ఉన్నందున పెద్ద విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు, జీడబ్ల్యూఎంసీ, ఆర్అండ్‌బీ, సాగునీటిపారుదల, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ

**నిజామాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ భుజంగరావు మట్టి గణపతులను పంపిణీ చేశారు. జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ద్వారా హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో జల వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని భుజంగరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్వో గీత, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, బోధన్ ఆర్డీవో విజయకుమారి, రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్‌రెడ్డి, ప్రశాంత్, డీ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లపై కక్ష సాధింపు తగదు

**ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలి: మోహన్‌రెడ్డి**




**నిజామాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రైతులకు అండగా నిలుస్తున్న రైస్ మిల్లర్లపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. మిల్లర్లపై దాడులను నిరసిస్తూ నిజామాబాద్ ధర్నాచౌక్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన 9.70 కోట్ల టన్నుల ధాన్యంలో ఇప్పటికే 9.60 కోట్ల టన్నులు అప్పగించామని, మిగిలిన 10 లక్షల టన్నుల కోసం మిల్లర్లను వేధించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో మోటూరి దయానంద్ గుప్తా, జిల్లాలోని పలువురు రైస్ మిల్లర్ లు పాల్గొన్నారు.

## తాండూర్ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



**మంచిర్యాల, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మందుల నిల్వలు, గడువు ముగియనున్న మందుల వినియోగం, ప్రయోగశాల పరీక్షలు, తెలంగాణ డయగ్నోస్టిక్స్‌కు పంపే నమూనాల వివరాలను రోజువారీగా నమోదు చేయాలని సూచించారు.వ్యాక్సిన్ల నిల్వలు, శీతలీకరణ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టి వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేయాలని, గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సిబ్బంది, వైద్య, నర్సింగ్, ప్రయోగశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ సంరక్షణలో అధికారుల పాత్ర కీలకం

**మంచిర్యాల, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**



అడవులను రక్షించి పర్యావరణ పరిరక్షణకు అటవీశాఖ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మందమర్రి మండలం గాంధారి వనంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అడవి అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతాలపై పడుతున్న నేపథ్యంలో అడవులు, పర్యావరణాన్ని కాపాడేందుకు అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆదివాసీ గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ అటవీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, తద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో పాటు అటవీశాఖ అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాతలకు కలెక్టర్ ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణపై అవగాహన

**కమిషనర్ తీరుపై చైర్‌పర్సన్, కౌన్సిలర్ల అసంతృప్తి**



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్.మురళీకృష్ణ, పట్టణ ఎస్ఐ శ్రీధర్ సూచించారు. సింగరేణి క్లబ్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, డీజే నిబంధనలు, సీసీ కెమెరాలు, వాలంటీర్ల ఏర్పాటు, నిమజ్జనం భద్రతపై సూచనలు చేశారు. అయితే మండపాల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరినా కమిషనర్ స్పందించడం లేదంటూ చైర్‌పర్సన్ సంధ్యారాణి, బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఉప్పలయ్య, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక భవన్ నిర్వాహకులు పనకంటి విలాస్ శర్మ, , వైదిక పురోహిత అర్చక బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రఘు జోషి, వేదపండితులు మేఘరాజ్ శర్మ, కిరణ్ శర్మ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దేవీదాస్ దేష్పాండే, కశ్యప్ శర్మ, మహేష్ దండనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎండోమెంట్ సెల్ జిల్లా కన్వీనర్‌గా ప్రవీణ్ కుమార్

**మందమర్రి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**



బీజేపీ ఎండోమెంట్ సెల్ మంచిర్యాల జిల్లా కన్వీనర్‌గా మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ సూచన మేరకు, రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కొండమీది మల్లేశం సమన్వయంతో ఈ నియామకం చేపట్టినట్లు రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్య ప్రకాష్ శుక్రవారం తెలిపారు. దేవాలయాలు, ధార్మిక సంస్థలు, ధార్మిక కార్యక్రమాల పరిరక్షణకు కృషి చేస్తూ జిల్లాలో ఎండోమెంట్ సెల్‌ను బలోపేతం చేయాలని ప్రవీణ్ కుమార్‌కు సూచించారు. మండల, అసెంబ్లీ నియోజకవర్గ, గ్రామస్థాయి కమిటీలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను విస్తరించాలని కోరారు.

## ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి గా గంట రాకేష్ నియామకం



**మందమర్రి సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి)**
కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శిగా మందమర్రి పట్టణానికి చెందిన గంట రాకేష్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎడవెల్లి వెంకటస్వామి,జాతీయ లీగల్ సెల్ కో కన్వీనర్ అక్బర్ లు రాకేష్ కు నియామక పత్రం అందజేశారు. రాకేష్ విద్యార్థి దశ నుంచే సామాజిక, విద్యార్థి సమస్యలపై చురుగ్గా పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తూనే, విద్యార్థి నాయకుడిగా కొనసాగుతున్నారు. మందమర్రి కి చెందిన రాకేష్ రాష్ట్ర కమిటీలో చోటు దక్కించుకోవడం పట్ల విద్యార్థి, యువజన వర్గాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలి



**నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో సమావేశమై ఆసుపత్రిలోని వైద్య సేవలు, ఓపీ వివరాలపై సమీక్షించారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాలకు అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్స యంత్రాల వివరాలను సేకరించారు. అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూరుస్తామని తెలిపారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిలుకూరులో నకిలీ డీజిల్ డబ్బాలు పట్టివేత



**చిలుకూరు సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి )**
చిలుకూరు గ్రామ శివారులో మురుగన్ ఏ బ్రిడ్జి కాటా వద్ద నకిలీ డిజిల్ అమ్ముతున్నారని సమాచారంతో పోలీసులు దాడి చేసి నకిలీ డబ్బాలను సీజ్ చేసినట్లు ఎస్సై బండి మోహన్ తెలిపారు. హైదరాబాదుకు చెందిన కానారం ప్రజావత్ విజయ్ అనే వ్యక్తినీ సేల్స్ మేనేజర్ గా పెట్టి పలు బ్రాండ్ల పేరుతో నకిలీ డిజిల్ను విక్రయిస్తున్నట్లు తెలిపారు.

## కార్మిక సంక్షేమ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కార్మికుల సంక్షేమం కోసం నిర్మించిన నూతన లేబర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన కార్మిక సంక్షేమ సహాయ కేంద్రాన్ని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి వర్చువల్‌గా ప్రారంభించగా, కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కేంద్ర భవనాన్ని నిరంతరం నిర్వహిస్తూ కార్మికులకు సేవలు అందేలా అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణానికి కృషి చేసిన అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రెడ్డి, అసిస్టెంట్ లేబర్ అధికారులు రాజలింగం, వినోద్, పంచాయతీ రాజ్ ఈఈ శివరామ్, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకులు రాజు, కార్మికులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఆదిలాబాద్ డివిజన్ ఎఫ్‌డీఓ ప్రతమేష్ కేశవ్ తిజారే అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మావల పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇంద్రవెల్లి రేంజ్ దస్నాపూర్ బీట్‌లో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఎఫ్‌బీఓ గౌస్ మొయినుద్దీన్, ఇచ్చోడ రేంజ్‌లో ముల్తానీలో హత్యకు గురైన మాంత్యా నాయక్ త్యాగాలను స్మరించుకున్నారు. వారి స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అమరవీరుల ధైర్యం, అంకితభావం ప్రస్తుత సిబ్బందికి స్ఫూర్తిదాయకమని ఎఫ్‌డీఓ పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. అనంతరం 9వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాల గోడప్రతులను డీడబ్ల్యూవో వినూత్నతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. అక్టోబర్ 8 వరకు పోషకాహారం, ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల పోషణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై అవగాహన

**కమిషనర్ తీరుపై చైర్‌పర్సన్, కౌన్సిలర్ల అసంతృప్తి**





**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ ఎన్.మురళీకృష్ణ, పట్టణ ఎస్ఐ శ్రీధర్ సూచించారు. సింగరేణి క్లబ్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, డీజే నిబంధనలు, సీసీ కెమెరాలు, వాలంటీర్ల ఏర్పాటు, నిమజ్జనం భద్రతపై సూచనలు చేశారు. అయితే మండపాల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరినా కమిషనర్ స్పందించడం లేదంటూ చైర్‌పర్సన్ సంధ్యారాణి, బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఉప్పలయ్య, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలి

**టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్‌రెడ్డి**



**నిర్మల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
అక్కాపూర్‌లోని 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా అక్కాపూర్ సబ్‌స్టేషన్‌కు 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసినట్లు తెలిపారు. అధిక లోడ్ నమోదయ్యే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ఎల్‌సీలు ఇవ్వకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని, సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. గణేష్ మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ మెంబర్ టెక్నికల్ జేఆర్ చవాన్, ఎస్ఈ రమేష్, డీఈలు నాగరాజు, తిలక్, వెంకట్రామయ్య, ఏఈలు సంజీవ్, వెంకటపతి రాజు, మల్లేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 5 రోజుల పని విధానం వెంటనే అమలు చేయాలి






**నిజామాబాద్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు నిజామాబాద్ ధర్నాచౌక్‌లో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన సుమారు 1,000 మంది ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొన్నారు.
బ్యాంకు ఉద్యోగుల పని భారం తగ్గించేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, న్యాయమైన పీఎల్ఐ అమలు చేయాలని, ఎన్పీఎస్ స్థానంలో ఓపీఎస్ పునరుద్ధరించాలని, పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ పెంపు, పెన్షన్ అప్డేషన్, రిటైర్డ్ ఉద్యోగుల వైద్య బీమా భారాన్ని తగ్గించడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే సెప్టెంబర్‌లో మూడు రోజుల సమ్మె, అక్టోబర్‌లో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ సమ్మెలో ఐ ఎఫ్ బి యు నిజామాబాదు యూనిట్ కన్వీనర్ ఎం ఎం.వి.రమేష్, గురునాథ్,రాజు, మనోజ్ సింగ్ , వంశీ, సందీప్, శ్రీనివాస్ మధు వెంకటేష్ మేఘన రాధా దివ్య తదితరులు పాల్గొన్నారు.

## మనువాద రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదు



**బోథ్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: తెలంగాణలో మనువాద రాజకీయాలకు స్థానం లేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు బోథ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అడగజేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును బీఆర్ఎస్ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. దళితులపై బీఆర్ఎస్ నేతల వైఖరిని ఖండిస్తూ పార్టీ తరపున క్షమాపణలు చెప్పాలని కోరారు.బీఆర్ఎస్ నాయకత్వం దళితులపై అనుసరిస్తున్న విధానాలను ఆ పార్టీకి చెందిన దళిత నేతలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా దళితవాడల్లో పర్యటించి ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోజన్న, మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్, దాస్, ఉప సర్పంచుల జిల్లా నాయకులు రమేష్, అరుణ్, మండల నాయకులు సాయన్న, అబుద్, రహీమ్, అచ్యుత్, షమేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వారి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ తెలంగాణ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ సౌజన్యంతో శుక్రవారం చౌటుప్పల పురపాలక కేంద్రంలో ట్రస్ట్ సభ్యులు బొబ్బిళ్ళ మురళి ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం లో మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చేతుల మీదుగా ప్రజలకు అందజేశారు. పర్యావరణ పరిరక్షించడం ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అని మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే లక్ష్యంతో భారత సేవా సహకార ఫోరం ఈ యొక్క కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రినిటీ విద్యాలయ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహా గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ధర్మకర్తలు ఆవుల యేసు యాదవ్, వర్కాల రవి గౌడ్,బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ రామకృష్ణ ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్తులతో కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ సంతోష్ కుమార్ శాస్త్రి పంతులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తిచేశారు.
ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి, అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పూజలో పాల్గొన్న ప్రతి భక్తురాలికీ లభించాలని ఆకాంక్షించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో విలసిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. పూజా అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, అన్నదాన దాతలు, స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## శ్రీ సోమనాథ క్షేత్రంలో శాంతి సమత్వ దినోత్సవం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సోమనాథ క్షేత్రంలో శుక్రవారం శాంతి సమత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ సోమనాథ మహర్షి ఆదేశానుసారం నిర్వహించిన వేడుకల్లో పురపాలక చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని శివలింగానికి క్షీరాభిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. క్షేత్ర కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ ప్రణవ, శాంతి పతాకాలను ఆవిష్కరించారు. వేదమూర్తుల ఆధ్వర్యంలో మృత్యుంజయ యాగం, అక్షర లక్ష్య యాగం నిర్వహించగా, సోమనాథ మహర్షి భక్తులు, శిష్యులు సామూహికంగా శతక పారాయణం చేశారు. ఈ ఉత్సవాల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు బడుగు జయప్రకాష్, క్షేత్ర కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పిడి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు మండలోజు సుభాష్ చారి, కార్యదర్శి గట్టు ప్రభాకర్, ఉప కార్యదర్శి చిరువెల్ల రవీందర్, కోశాధికారి ఊరా కృష్ణమూర్తి, మహర్షి శిష్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఓటర్ల జాబితా పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**తిమ్మాపూర్, సెప్టెంబరు 11, ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా పరిశీలనను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె నో మ్యాపింగ్ ఓటర్ల పరిశీలనపై అధికారులతో సమీక్షించారు. నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాలని, ఓటర్ల తొలగింపుల విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సూచించారు. సేకరించిన పత్రాలను బీఎల్‌వోల యాప్‌లో నమోదు చేసి, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం రికార్డు చేయాలన్నారు. ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తులను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. బీఎల్‌వోలు చేపడుతున్న ప్రక్రియను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వేముల శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గీకురు రవీందర్ కుటుంబాన్ని పరామర్శించిన ఈటల రాజేందర్



**చిగురుమామిడి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్, చిగురుమామిడి మండల మాజీ జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్ గీకురు రవీందర్ ఇటీవల మృతిచెందగా, శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి రవీందర్ స్వగృహానికి వెళ్లిన ఈటల రాజేందర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యమ సహచరుడు, ప్రజాసేవకుడు గీకురు రవీందర్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన మరణం కుటుంబంతో పాటు మండల ప్రజలకు తీరని లోటని పేర్కొంటూ, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిట్టల రవీందర్, కునచ్చుల మహేందర్, రాయిశెట్టి చంద్రయ్య, పోలోజు సంతోష్ కుమార్, చెరుకు సంజీవ్, చెరుకు చిన్నసమ్మయ్య, పెసరి రాజేశం, గునుకుల మధుసూదన్‌రెడ్డి, అచ్చ రవీందర్, పిల్లి తిరుపతి, భీమర లక్ష్మణ్, తిప్పారపు శ్రీనివాస్, గందె చిరంజీవి, పెసరి హరీష్, పడాల శ్రీనివాస్, సిద్ధంకి అనిల్, మామిడి రమేష్, గందె రమేష్, నక్క రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

### సిరిసిల్ల ఇన్స్పెక్టర్ శ్రీనివాస్

**సిరిసిల్ల,సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీస్ కమిటీ సభ్యులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన నియమలపై ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను సజావుగా నిర్వహించేలా పీస్ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు.

## విద్యుత్ కోతలపై రైతుల ధర్నా



**చిగురుమామిడి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధించడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం సుందరగిరిలో రాస్తారోకో నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కత్తుల రమేష్ ఆధ్వర్యంలో బొమ్మనపెల్లి, సుందరగిరి, నవాపేట్, ఉల్లంపెల్లి గ్రామాల రైతులు ఎండిన మొక్కజొన్న, పత్తి, వరి పంటలతో కరీంనగర్--హుస్నాబాద్ రహదారిపై బైఠాయించారు.
ఈ సందర్భంగా కత్తుల రమేష్ అధికారుల కాళ్లు మొక్కి, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ అధికారులు సమయానికి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ సహకార సంఘం చైర్మన్ రమణరెడ్డి, మిట్టపల్లి మల్లేశం, రైతులు, యువకులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

**బుగ్గారం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని బుగ్గారం ఎస్ఐ జి. సతీష్ మండపాల నిర్వాహకులు, ప్రజలకు సూచించారు. మండపాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డీజేలకు అనుమతి లేదని, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఊరేగింపు, నిమజ్జనంలో మద్యం సేవించడం, గొడవలు, అసభ్య ప్రవర్తనకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు.

- **మద్యం సేవించి పట్టుబడిన 182 మంది మందు బాబులకు జరిమానాలు**
- **వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్**




**వేములవాడ, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు వేములవాడ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 182 మందిని లోక్ అదాలత్‌లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ మేఘన విచారణ అనంతరం నిందితులకు జరిమానాలు విధించారు. 52 మందికి ఒక్కొక్కరికి రూ. 4,000 చొప్పున, 26 మందికి రూ. 5,000 చొప్పున, 45 మందికి రూ. 3,000 చొప్పున, 59 మందికి రూ. 2,000 చొప్పున జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ దిలీప్ మాట్లాడుతూ..మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురై కుటుంబాలను రోడ్డున పడేయవద్దని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా ముప్పు కలిగించవద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడిపి కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## విద్యుత్ డిమాండ్ దృష్ట్యా కెపాసిటర్ బ్యాంకులో ఏర్పాటు

### ఏఈ మునిందర్ రెడ్డి



**ధర్మారం, సెప్టెంబర్ 11( తెలంగాణ వాణి)**
ఎల్‌నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం డిమాండ్ అధికమవుతున్న నేపథ్యంలో ధర్మారం మండల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఏఈ ఏనుగు మునిందర్ రెడ్డితెలిపారు. ఇందులో భాగంగా ధర్మారం మండల పరిధిలోని సంబంధిత సబ్‌స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన కెపాసిటర్ బ్యాంకులను ప్రస్తుత విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా సర్దుబాటు చేసి, అవసరమైన మేరకు నిర్వహణలోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. పవర్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరచడంతో పాటు, వోల్టేజ్ స్థిరత్వాన్ని పెంపొందించి విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం జరిగిందన్నారు .దీని ద్వారా విద్యుత్ నష్టాలను తగ్గించడం, విద్యుత్ వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ధర్మారం మండల ప్రజలకు నాణ్యమైన, స్థిరమైన మరియు నిరంతర విద్యుత్ సరఫరాను అందించడంసాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఈ జి .వెంకటరమణయ్య , ఖిలావనపర్తి ఏ ఈ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## జ్యోతిష్మతికి అరుదైన "టైర్-1" గుర్తింపు

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 11, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిట్స్) బీటెక్ సీఎస్ఈ (ఏఐ, ఎంఎల్) ప్రోగ్రామ్‌కు వాషింగ్టన్ అకార్డ్ పరిధిలో 'టైర్-1 ఎన్‌బీఏ' గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు 2026 జనవరి 1 నుంచి మూడేళ్లపాటు చెల్లుబాటులో ఉంటుందని యాజమాన్యం తెలిపింది. దేశంలో ఈ విభాగంలో టైర్-1 గుర్తింపు పొందిన మూడు కళాశాలల్లో జిట్స్ ఒకటని, ఈ ప్రాంతంలో ఈ గుర్తింపు పొందిన ఏకైక కళాశాల జిట్స్ మాత్రమేనని పేర్కొంది. దీంతో కళాశాలలో ఎన్‌బీఏ గుర్తింపు పొందిన యూజీ కోర్సుల (సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ ఏఐ-ఎంఎల్) సంఖ్య నాలుగుకు చేరింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ జె.సాగర్‌రావు, సెక్రటరీ జె.సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ డా. టి. అనిల్‌కుమార్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు.

## మంత్రి సహకారంతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



**జగిత్యాల/బుగ్గారం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేఖరి):**
బుగ్గారం మండల కేంద్రంలోని 1వ వార్డులో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో డ్రైనేజీ కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టడంతో వార్డు ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన మంత్రికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కల్వర్టు నిర్మాణానికి సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్స గౌడ్‌కు కూడా ధన్యవాదాలు తెలిపారు.

## కట్కూరి నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించిన 'తెలంగాణ వాణి' ఎడిటర్ సంపత్



**చిట్యాల, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కట్కూరి ఐలయ్య తండ్రి కట్కూరి నర్సయ్య పెద్దకర్మ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి 'తెలంగాణ వాణి' దినపత్రిక ఎడిటర్ జేరిపోతుల సంపత్, జిల్లా స్టాఫర్ వంశీకృష్ణ, జమ్మికుంట రిపోర్టర్ పుల్లూరి చేరాలు, చిట్యాల మండల రిపోర్టర్ కట్కూరి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కట్కూరి నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ కట్కూరి ఐలయ్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పాత్రికేయులు, గ్రామస్తులు పాల్గొని నర్సయ్యకు నివాళులర్పించారు.

## ఆర్ డీ ఓ కు వినతి పత్రం అందజేత కొమ్ము గణేష్



**చండూర్ సెప్టెంబర్ 11( తెలంగాణ వాణి ప్రతినిధి )**
చండూర్ మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డీఓకు వినతి పత్రం అందజేశారు,ఈ సందర్భంగా కొమ్ము గణేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాలపై ఆధారపడి సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. చండూరు మండలంలోని అనేక గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరు బావులపై ఆధారపడిన రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు చేతికొచ్చే పరిస్థితి లేక రైతులు పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు,ప్రభుత్వం వెంటనే మండలంలోని పరిస్థితులను అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలింపజేసి, చండూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు,అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు సమగ్ర సర్వే నిర్వహించి తగిన నష్టపరిహారం అందించాలని, రైతులకు రుణ భారం నుంచి ఉపశమనం కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కొమ్ము గణేష్ కోరారు.



## మొగిలిపాలెం సర్పంచ్‌పై దాడి దురదృష్టకరం

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మానకొండూరు నియోజకవర్గంలో అభివృద్ధిపై ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని, నియోజకవర్గంలో రౌడీ రాజ్యం కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మొగిలిపాలెం సర్పంచ్ తాట్ల తిరుపతిపై గురువారం జరిగిన దాడి నేపథ్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పార్టీ నాయకులతో కలిసి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి వెళ్లిన సర్పంచ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులు యూరియా కోరిన సందర్భంలో సొసైటీ చైర్మన్ రమణారెడ్డి వ్యవహరించిన తీరుపై కూడా ఆయన విమర్శలు చేశారు. రమణారెడ్డిని పార్టీతో పాటు సొసైటీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం రసమయి బాలకిషన్, నాయకులు నుస్తులాపూర్ నుంచి ర్యాలీగా మొగిలిపాలెం చేరుకుని సర్పంచ్ తిరుపతిని పరామర్శించి ఘటన వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**మట్టి వినాయకుని పూజిద్దాం**

**ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు**



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11, (తెలంగాణ వాణి):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వినాయక చవితి పండుగకు ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం వివిధ పనుల నిమిత్తం దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగులు హైదరాబాదు లో ప్రధాన కార్యాలయానికి వెళ్లడంతో వారికి వినాయక చవితి పండుగ పురస్కరించుకొని మట్టి వినాయకులను ఉచితంగా అంద జేస్తున్నామన్నారు. ప్రజలు అందరూ మట్టి వినాయకుడు మాత్రమే పూజించి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపు కోవాలని తద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిడిఎన్ అర్చక సంఘం అధ్యక్షులు వాసు దేవ శర్మ. రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్. సూరజ్ తివారి, గుడి సంతోష్ కుమార్, గోవింద మిశ్రా, ఇతరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకం

- **విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**
- **కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, మండల విద్యాధికారి వి శేఖర్**



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11,(తెలంగాణ వాణి):**
విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెద్ద శంకరంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, మండల విద్యాధికారి వి శేఖర్ లు అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రెషర్స్ డే సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో లక్ష్యం పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, భవిష్యత్తులో మంచి కోర్సులను ఎంచుకొని అత్యుత్తమ స్థానాలకు విద్యార్థులు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు అనంత రాజు శర్మ, ప్రభాకర్, మల్లేశం, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక

**- వినాయక చవితి పోటీల్లో ముస్లిం చిన్నారి ప్రతిభ**





**జమ్మికుంట, సెప్టెంబర్ 11, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని, కృష్ణ కాలనీలో నివాసముంటున్న యాకూబ్ అలీ బాబా – సానియా సుల్తానా దంపతుల కుమార్తె అలీజా, తన ప్రతిభతో మత సామరస్యానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచింది. స్థానిక న్యూ మిలీనియం పాఠశాలలో ఈ చిన్నారి మూడో తరగతి చదువుతోంది. వినాయక చవితి పండుగ వేడుకల్లో భాగంగా, పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన గణపతి విగ్రహాల తయారీ, ప్రదర్శన పోటీల్లో అలీజా ఎంతో ఉత్సాహంగా పాల్గొని, గణనాథుడి ప్రతిమను రూపొందించింది. కులమతాలకు అతీతంగా, ఐక్యతా భావాన్ని చాటుతూ, అలీజా చూపించిన ఈ ఉత్సాహాన్ని, పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఎంతో కొనియాడారు. సంస్కృతులు, పండుగలు మనుషులను ఏకం చేస్తాయని, మత సామరస్యానికి ఈ చిన్నారి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందని, పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వినూత్న ఆలోచనతో, లౌకిక భావనతో పోటీల్లో భాగస్వామ్యమైన అలీజాను, ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించాయి. చిన్నతనం నుంచే పిల్లల్లో ఇలాంటి సౌభ్రాతృత్వాన్ని, సమైక్యతా భావాన్ని ప్రోత్సహించడం సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పలువురు కొనియాడారు.

## సుగ్లాంపల్లి 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

- **టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ**
- **విద్యుత్ లోడ్ స్థితిగతులపై సమీక్ష..**
- **కమాన్‌పూర్‌లో 31.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఆదేశాలు**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేసి, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇందులో భాగంగా చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ట్రాన్స్‌కో అధికారులతో కలిసి సుగ్లాంపల్లిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని సాంకేతిక అంశాలు, విద్యుత్ లోడ్ పరిస్థితులు, పరికరాల పనితీరును సీఎండీ స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అత్యంత నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గ్రిడ్ భద్రతతో పాటు విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తకుండా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే కమాన్‌పూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోడ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 31.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. ఇందుకు సంబంధించి తక్షణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులను సీఎండీ ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎండీ.. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. వినియోగదారులకు సరైన వోల్టేజ్ స్థాయిలతో నిరంతర, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.
ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, సాంకేతిక లోపాలను ముందుగానే గుర్తించి నివారించాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, గ్రిడ్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు విజయ్‌కుమార్ పాపారావు, ఎన్.శ్రీనివాస్, డీఈ భూమయ్య, పెద్దపల్లి డీఈ సీహెచ్.రాజా బ్రహ్మచారి, ఏడీఈ, ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**హుస్నాబాద్ సెప్టెంబర్ 11 తెలంగాణ వాణి ఆర్ సి)**
హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఫెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థినుల కు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపల్ వి లలిత అధ్యక్షతన నిర్వహించగా, సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే రవీందర్ రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూప్రభుత్వ కళాశాల విద్యార్థినిలు కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారనితెలుపుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని తెలిపారు. విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం కూడా మంచి ఫలితాలను సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ లో 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించిన తూర్పాటి వైష్ణవి అనే విద్యార్థినికి నగదు బహుమతిని అందజేశారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 442 మార్కులు సాధించిన విద్యార్థిని కటోజ్ వసుమిత్రకు నగదు బహుమతినిఅందజేశారు. అలాగే బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు గాను 432 మార్కులు సాధించిన విద్యార్థిని మగుటం సంగీతకు నగదు బహుమతిని అందజేశారు. నగదు బహుమతులను ఇచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ వి.లలిత, చరిత్ర అధ్యాపకులు ఏ.సంపత్, రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించిన విద్యార్థినులను కే.రవీందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమాలలోహుస్నాబాద్ జెడ్ పి హెచ్ ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్, హుస్నాబాద్ జెడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాలప్రధానోపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం డి.రవీందర్,ఎస్ .సదానందం, టి.నిర్మలాదేవి,బి.లక్ష్మయ్య,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. కర్ణాకర్, ఏ.సంపత్, ఎస్ కవిత,కే.స్వరూప, జి. కవిత,ఆస్మా పిర్దోస్,ఓ. రాణి,అధ్యాపకేతర బృందం జూనియర్ అసిస్టెంట్లు కే.గీతాంజలి, ఎస్.రాములు రికార్డు అసిస్టెంట్ టి.రమాదేవి విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. ద్యార్థినిలు చేసిన నృత్యాలు అందర్నీ అలరించాయి.

## పత్తి రైతులు పత్తి కొన త్రుంచితేనే అధిక దిగుబడి.

**వ్యవసాయ విస్తీర్ణ అధికారి సంతోష్,**



**సంగారెడ్డి,కంగ్టి, సెప్టెంబర్ 11,( తెలంగాణ వాణి ప్రతినిధి )**
కంగ్టి మండలం భీమ్రా లో సంచలన ప్రదర్శన వ్యవసాయ విస్తీర్ణ అధికారి అరుదైన చిట్కా. కంగ్టి పత్తి సాగులో ఖర్చు తగ్గించి, దిగుబడి పెంచే అద్భుతమైన చిట్కాను వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్,శుక్రవారం భీమ్రా గ్రామంలో నిర్వహించిన ప్రత్యక్ష క్షేత్ర ప్రదర్శనలో రైతులకు కళ్లు తెరిపించే వాస్తవాన్ని అవగాహన కల్పించారు. పత్తి మొక్క నిలువుగా పెరగడం వల్ల లాభం లేదు,కేవలం పక్క కొమ్మలకే కాయలు కాస్తాయి. కాబట్టి విత్తిన 85 నుంచి 90 రోజుల లోపు ప్రధాన కాండం కొనను త్రుంచేయాలి. దీన్నే ట్యాపింగ్ అని అంటారు. కొన త్రుంచితే అగ్ర ప్రభావం పోయి,మొక్క పైకి పెరగడం ఆగుతుంది. అప్పుడు మొక్క తయారుచేసే ఆహారం,హార్మోన్లు అన్నీ నేరుగా కాయ కొమ్మలకు,పూతకు, పిందెకు మళ్లుతాయి. దీంతో పూత రాలడం తగ్గి,కాయ సైజు, దూది బరువు భారీగా పెరుగుతుంది అని వ్యవసాయ విస్తీర్ణ అధికారి తెలిపారు. ఇది స్వల్ప ఖర్చుతో ఎక్కువ లాభం ఇచ్చే పద్ధతి మొక్క ఎత్తుగా పెరిగి ఆకులకే సరిపోయే పోషకాలు ఇక కాయలకు అందుతాయి. ఫలితంగా కాయల సంఖ్య,నాణ్యత పెరిగి బంపర్ దిగుబడి వస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో నీరు లేనప్పుడు ఈ ట్యాపింగ్ చేయకూడదని అధికారి రైతులకు సూచించారు. ఈ ప్రదర్శనతో భీమ్రా రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతన్నలు తమ సందేహాలను తీర్చిన అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసుల అండ

**మెదక్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ మహిపాల్ (పీసీ నం.3026) కుటుంబానికి తోటి పోలీసు సిబ్బంది ఆర్థిక భరోసా కల్పించారు. మహిపాల్ బ్యాచ్‌మేట్స్, క్యూఆర్‌టీ సిబ్బంది, జిల్లా పోలీసు సిబ్బంది కలిసి రూ.4.21 లక్షలు సమీకరించి, ఆయన భార్య, పిల్లల పేర్లపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన రూ.4.21 లక్షల చెక్కును మెదక్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా పోలీసు సిబ్బంది కలిసి మహిపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతొల్లా అభిలాష్, వైస్ ప్రెసిడెంట్ సందీప్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ట్రెజరర్ అర్కా విజయ్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు విజయ్, సాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు. మృతి చెందిన సహచరుడి కుటుంబానికి అండగా నిలిచిన పోలీసు సిబ్బందిని పలువురు అభినందించారు.

## 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం శుక్రవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాలల అభివృద్ధికి అంకిత భావంతో సేవలందించిన 14 మంది ఉపాధ్యాయులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్ అలీ పాల్గొని ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. మండలాన్ని విద్యారంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగుల నరేశం, ఎంపీడీఓ సూపరింటెండెంట్ చక్రధర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.ఆనంద రావు, వి.గంగాధర్, జోష్ణ, భారతి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు







## గ్రామాభివృద్ధికి దోహదపడే పనులకే ప్రాధాన్యం

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్లగొండ, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీబీజీ రామ్‌జీ పథకం కింద గ్రామాభివృద్ధికి దోహదపడే పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పనుల సంఖ్య, కూలీల సంఖ్య పెంచి మెటీరియల్ కాంపోనెంట్‌ను అధికంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామసభలో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని సూచించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, ప్రహరీలు, ల్యాబొరేటరీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భూగర్భ జలాల పరిరక్షణకు చెరువులు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, మ్యాజిక్ సోక్‌పిట్ల పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారుల జీవనోపాధి పెంపునకు అనువైన చెరువుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీపీఓ తరుణ్ చక్రవర్తి, డీఎఫ్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజమహేశ్వరికి ఘన సన్మానం




**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
ధర్మారం గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాజమహేశ్వరి కోరుట్ల మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్న సందర్భంగా శుక్రవారం గ్రామ పంచాయతీ, అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉప సర్పంచ్ గణేష్, పంచాయతీ కార్యదర్శి సల్మా సుల్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారణకు పటిష్ట చర్యలు

**ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించాలి:**

**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



కోతుల బెడద నుంచి ప్రజలు, రైతులకు ఉపశమనం కల్పించేలా మున్సిపల్ కమిషనర్లు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నర్సాపూర్, తూప్రాన్, మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారని కలెక్టర్ తెలిపారు. మెదక్‌లో 3,000, నర్సాపూర్‌లో 2,000, తూప్రాన్‌లో 1,000, రామాయంపేటలో 500 కోతులు ఉన్నట్లు వివరించారు. కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి దశలవారీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోతులను పట్టుకుని నిర్మల్ జిల్లాకు తరలించి, అవసరమైన ఆపరేషన్లు అనంతరం అక్కడే వదిలేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని వర్గాల సహకారంతో మెదక్‌ను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## పైడిమడుగులో రోడ్డెక్కిన అన్నదాతలు

**యూరియా యాప్‌లు రద్దు చేయాలి..**

**నిరంతర విద్యుత్ అందించాలి**



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**
యూరియా పంపిణీకి తీసుకొచ్చిన యాప్‌ల విధానాన్ని రద్దు చేసి, సాగుకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడిమడుగులో రైతులు ఆందోళన చేపట్టారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పంటలు ఎండిపోతున్నాయని, యాప్‌ల కారణంగా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## సన్న వడ్ల బోనస్ నమోదు గడువు పొడిగింపు



**పెద్దపల్లి , సెప్టెంబర్,11 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**

వానాకాలం--2026 సీజన్‌లో సన్న వడ్లు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్ కోసం ఆన్‌లైన్ నమోదు గడువును సెప్టెంబర్ 17 వరకు పొడిగించినట్లు పాలకుర్తి మండల వ్యవసాయాధికారి తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లు సాగు చేసిన రైతులు గడువులోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సొంత విత్తనం ఉపయోగించిన రైతులు స్వీయ ధృవీకరణ పత్రం, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌తో సంబంధిత ఏఈఓలను సంప్రదించాలన్నారు.మండలంలో డిజిటల్ పంట నమోదు 20 శాతం పూర్తయిందని, ప్రతి గ్రామంలో వాలంటీర్ల ద్వారా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. రైతులందరూ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతిపత్రం



**రాజపేట సెప్టెంబర్: 11(తెలంగాణ వాణి విలేఖరి)**

మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాజాపేట మండల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తాహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసిల్దారు ప్రదీప్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోయ మధు మాజీ ఎంపీటీసీ మాజీ మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు మండల ప్రధాన కార్యదర్శి మెందు భగవాన్ రెడ్డి ఉప సర్పంచ్ మార్క శివ మల్యాల భరత్ డొంకెన సంపత్ గౌడ్ కాకల్ల నవీన్ పోచం గళ్ళ బాబు పారుపల్లి సంజీవ రెడ్డి గాదె సాయి బూర్గు భాస్కర్ రెడ్డి ఎమ్మా కుమార్ బోనగిరి సాయి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం



**రాజపేట, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి విలేకరి):**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ తఖియుద్దిన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు, సీఐ శంకర్, ఎంపీడీఓ అనిత, డిప్యూటీ తహశీల్దార్ ప్రదీప్ పాల్గొని విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జనం, ఊరేగింపులు, ట్రాఫిక్, శాంతిభద్రతలపై సూచనలు చేశారు.నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను సామరస్య వాతావరణంలో నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేష్ విగ్రహాలను డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, అఖిలపక్ష నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

## చలో అసెంబ్లీకి బయలుదేరిన ముదిరాజ్‌ల ముందస్తు అరెస్టు



**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం చేపట్టిన 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమానికి బయలుదేరిన పెద్ద శంకరం పేట మండల ముదిరాజ్ సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, కామారెడ్డి డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని, మత్స్యకారులకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని కోరారు. ముదిరాజ్ సంక్షేమానికి ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**రేగోడ్‌లోనూ అరెస్టులు:**

రేగోడ్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి బయలుదేరిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్డేపల్లి శివకుమార్ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు, వివిధ గ్రామాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు సొంత ఆదాయంపై చట్ట సవరణకు హర్షం

**పెద్దపల్లి , సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**

గ్రామపంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీలో జమ చేయకుండా పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేసి, గ్రామసభ తీర్మానంతో ఖర్చు చేసుకునేలా పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంపై గ్రామ సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు.అంతర్గాం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం కిరణ్‌కుమార్ గౌడ్, సర్పంచులు మాట్లాడుతూ ఈ నిర్ణయం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలకు నిధుల కొరతతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో అంతర్గాం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగం కిరణ్ గౌడ్,సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్, సర్పంచ్ లు ముక్కెర మొగిలి,గుంట బాపు, గద్దల విమల-



రాజయ్య , మాజీ ఎంపీటీసీ బొడ్డు లింగమూర్తి పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల సమస్యలను పరిష్కరించాలి

**మిల్లింగ్ నిలిపివేత నిర్ణయం.. కలెక్టర్‌కు రైస్ మిల్లర్ల వినతి**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (తెలంగాణ వాణి):**

రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ధాన్యం మిల్లింగ్, బిల్లింగ్ సమయంలో ఏర్పడుతున్న తరుగు, ఎఫ్‌సీఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. బిల్లింగ్ ప్రక్రియలో రవాణా, నూకలు, పరమ తదితర తరుగుదలలతో కలిపి సుమారు 15 నుంచి 20 శాతం వరకు నష్టం వస్తోందని మిల్లర్లు తెలిపారు. ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలో ఈ తరుగుదలను సక్రమంగా పరిగణనలోకి తీసుకోక పోవడంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందన్నారు.







అలాగే ఎఫ్‌సీఐ బాయిల్డ్ రైస్ స్వీకరణ నిలిపివేసి రా రైస్ మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నప్పటికీ, తమకు కేటాయిస్తున్న ధాన్యం రా రైస్ తయారీకి అనుకూలంగా లేదని వివరించారు. సమస్యలకు పరిష్కారం లభించే వరకు జిల్లాలోని రైస్ మిల్లులు మిల్లింగ్ కార్యక్రమాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ పల్లపోతు శ్రీనివాసు, వెంకటేశ్వరరెడ్డి, కంచర్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వ్యవసాయ మోటార్లు, పంప్‌సెట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భూమ్యాకాశాలు ఏకమైనా, ఎవరైనా ఒత్తిడి తెచ్చినా వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు అమర్చబోమని శుక్రవారం ఆయన శాసనమండలిలో తేల్చిచెప్పారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతారంటూ రైతుల్లో అనవసర భయాలు, అపోహలు సృష్టించవద్దని కోరారు. వ్యవసాయ పంప్‌సెట్ల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని ఇప్పటికే స్పష్టంగా వెల్లడించిందని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో ఉదయ్ పథకం కింద త్రైపాక్షిక ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పథకంలో వ్యవసాయ పంప్‌సెట్లకు తప్పనిసరిగా మీటర్లు ఏర్పాటు చేయాలనే నిబంధన ఎక్కడా లేదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ఆధునీకరించడంతోపాటు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్



చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ ద్వారా 60 శాతం గ్రాంట్ అందిస్తోందని, మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.

**రైతులపై భారంలేని ఆధునీకరణ**

ఆర్డీఎస్ఎస్ కింద చేపడుతున్న పనులు వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు పెట్టడం కోసం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే లైన్‌మన్ అనేక కిలోమీటర్లు వెళ్లి లోపాన్ని గుర్తించాల్సి వస్తోందని, కొత్త సాంకేతికతతో సబ్‌స్టేషన్, కంట్రోల్ రూమ్‌కే సమాచారం వెంటనే చేరుతుందని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సెప్టెంబర్ 9న 19,543 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైందని తెలిపారు. వ్యవసాయ పంప్‌సెట్లను సోలరైజేషన్ చేయడం ద్వారా విద్యుత్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని హరిత ఇంధనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ డిమాండ్ పెరగడానికి వర్షాభావ పరిస్థితులే ప్రధాన కారణమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందన్నారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలమట్టాలు పడిపోయాయని, ఫలితంగా వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని తెలిపారు.

# మోడీ ప్రజాసేవకు అంకితంగా 'సేవా సంకల్ప్ అభియాన్': రాంచందర్ రావు

: నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాటు దేశానికి అందించిన విశిష్ట సేవలను పురస్కరించుకుని నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 17న మోడీ జన్మదినం నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ చేపడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో ఆశీర్వాద్ కా దియా కార్యక్రమంతో ఈ అభియాన్‌ను ప్రారంభిస్తామన్నారు.

మోడీ పాలన పట్ల కృతజ్ఞతగా ప్రతి ఒక్కరూ ఇళ్లలో దీపాలు వెలిగించి ఆశీర్వదించాలని కోరారు. రాజకీయ అంశాలకే పరిమితం కాకుండా కార్యకర్తల్లో సేవాభావాన్ని నింపడమే బీజేపీ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, వ్యాసరచన పోటీలు, మేరే సప్నో కా భారత్, సేవా జ్యోతి కలశ్ యాత్ర, సుశాసన్ సేవా సంవాద్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 25న పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి, అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కూడా ఈ అభియాన్‌లో భాగంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

**వికసిత భారత్ నిర్మాణంలో విద్యార్థులే కీలకం..**

చట్టసభలు దూషణల వేదికలుగా మారడం దురదృష్టకరమని, విద్యావంతులైన యువతరం రాజకీయాల్లోకి వచ్చినప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని రాంచందర్ రావు



పేర్కొన్నారు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరగాలని, అధికార-విపక్షాలు పరస్పరం దూషణలకు పరిమితం కాకుండా ప్రజల గొంతుకగా నిలవాలని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీలో జరుగుతున్న రభస, నిరాధార ఆరోపణలు, సభా ఔచిత్యాన్ని దెబ్బతీసే వైఖరిని చూసి ప్రస్తుత ప్రజాప్రతినిధులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.



# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?

ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.




# జూ. ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మెప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.

# నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



# విభిన్న పాత్రలను ఎంచుకుంటా

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com